సాక్షి వికారాబాద్

శనివారం। 14। సెప్టెంబర్। 2024



అరెస్టులే నిదర్శనం

కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వ పోకడలకు అక్రమ అరెస్టులే నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి విమర్శించారు. 8లో▸



వైద్యుడికి మెమో జారీ

తాండూరు పట్టణంలోని ఎంసీహెచ్ వైద్యుడికి జిల్లా ఉన్నతాధికారులు శుక్రవారం మెమో జారీ చేశారు. 8లో▸



అపరిశుభ్రం..అవస్థల భయం!

అపరిశుభ్ర వాతావరణంతో ప్రభుత్వ కార్యాలయ భవనాలు పాములు, కోతులకు నెలవుగా మారాయి. 9లో▸

న్యూస్‌రీల్

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

పరిగి: పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 15న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.అండర్-14, -16, -18, -20 విభాగాల్లో బాల బాలికలకు పరుగు పందెం పోటీలు నిర్వహిస్తామన్నారు. 100, 400, 800, 1,500ల మీటర్ల పోటీలు ఉంటాయన్నారు. అలాగే లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే పోటీలకు హాజరయ్యే వారు తహసీల్దార్ జారీ చేసిన వయస్సు ధ్రువీకరణ పత్రంతో రావాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9912328142, 99513 4343లలో సంప్రదించాలని సూచించారు.

‘ప్రజాపాలన’ను ఘనంగా నిర్వహిద్దాం

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



అనంతగిరి: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శుక్రవారం తన చాంబర్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖల అధికారులతో మాట్లాడారు. ఈ నెల 17న కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేదిక, అతిథులు కూర్చోవడానికి ఏర్పాట్లు, తాగునీటి వసతి కల్పించాలన్నారు. వైద్య బృందం అందుబాటులో ఉండాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూసుకోవాలని అన్నారు. అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓ రేణుకాదేవికి సూచించారు.

గణనాథుడి సేవలో ఎస్పీ



అన్నదాన కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: వికారాబాద్‌లోని ఏఆర్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడిని ఎస్పీ నారాయణరెడ్డి తన సిబ్బందితో కలిసి దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఓ జ్యోతిర్మణి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీస్ ప్రెసిడెంట్ అశోక్ పాల్గొన్నారు.

సీసీఐలో నిలిచిన సిమెంట్ ఉత్పత్తి

కోల్‌మిల్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య

తాండూరు రూరల్: మండలంలోని కరన్‌కోట్ శివారులో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధీనంలో కొనసాగుతున్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ఫ్యాక్టరీలో సిమెంట్ ఉత్పత్తి నిలిచిపోయింది. కోల్‌మిల్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో నాలుగు రోజుల నుంచి ఉత్పత్తి ఆగిపోయినట్లు తెలిసింది. పరిశ్రమలో ప్రతి రోజూ 3వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతుంది. 300 మంది కార్మికులు పని చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఔత్సాహిక సంస్థలు దరఖాస్తు చేసుకోవాలి

అనంతగిరి: మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కింద చదువుకున్న నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు ఔత్సాహిక సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి హన్మంత్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శిక్షణ సంస్థలు వారి శిక్షణకు సంబంధించిన పత్రాలు, ప్రాజెక్టు రిపోర్టులతోపాటు హార్డ్ కాపీలను హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో అక్టోబర్ 4వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



లీకేజీల కారణంగా రెండో అంతస్తులో దెబ్బతిన్న పాల్ సీలింగ్



పెచ్చులూడటంతో చేపట్టిన మరమ్మతులు (ఫైల్)

లీకేజీల కలెక్టరేట్ !

ప్రారంభించిన రెండేళ్లకే పెచ్చులూడుతున్న భవనం

- ఏడాదిగా తరచూ మరమ్మతులు
- పై ఫ్లోర్ నుంచి కారుతున్న వర్షపునీరు
- రూ.60.7 కోట్ల వ్యయంతో భవన నిర్మాణం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

వికారాబాద్: ఏదైనా ఒక నిర్మాణం చేపడితే వందేళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉండాలి. అందులోనూ ప్రజాధనం ఖర్చు చేసి చేపట్టేవి అయితే మరింత శ్రద్ధ పెట్టాలి.. కానీ నిర్మాణ సమయంలో పర్యవేక్షణలోపం, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో పనులు పూర్తయిన కొన్నేళ్లకే దెబ్బతింటున్నాయి. ఈ కోవలోకే వస్తుంది వికారాబాద్ కలెక్టరేట్.. భవన నిర్మాణం పూర్తయి రెండేళ్లవుతోంది. ఏడాది నుంచే లీకేజీలు బయటపడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పై ఫ్లోర్ నుంచి నీరు కురుస్తోంది. భవనం బయటి భాగం నుంచి పెచ్చులూడి పడుతున్నాయి.



లోపించిన పారిశుద్ధ్యం

అన్నిహంగులతో..

జిల్లా కేంద్రంలో రూ.60.7 కోట్లు వెచ్చించి అన్ని హంగులతో కలెక్టరేట్ భవనాన్ని నిర్మించారు. రెండేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చింది. గతేడాది కార్యాలయ ఎడమ భాగంలో పెచ్చులూడిపోగా నామమాత్రంగా మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. చాలా చోట్ల వర్షపు నీరు స్లాబ్‌ల నుంచి, గోడల నుంచి లీకేజీ అవుతోంది. దీంతో పీఓపీ ఊడి కింద పడుతోంది. రెండో అంతస్తులో ఎక్కువ చోట్ల పెచ్చులూడుతున్నాయి. జిల్లాస్థాయి అధికారులు ఉండే ఇంత పెద్ద భవనంలో ఇలాంటి పరిస్థితి దాపురించడం విమర్శలకు తావిస్తోంది.

2022లో ప్రారంభం

కొత్త జిల్లాలు ఏర్పాటైన తర్వాత కూడా చాలా కార్యాలయాలు అక్కడక్కడ విసిరేసినట్లుగా ఉండేవి. దీంతో వాటన్నంటినీ ఒకే చోట నిర్మించాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా రైతుల నుంచి 34 ఎకరాల భూమిని సేకరించింది. రూ.60.7 కోట్ల వ్యయంతో కలెక్టర్ కార్యాలయ సముదాయాన్ని నిర్మించారు. నిర్మాణ సమయంలోనూ తీవ్ర జాప్యం జరిగింది. దాదాపు ఏడేళ్లపాటు పనులు సాగాయి. 2022 ఆగస్టులో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా కలెక్టరేట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. 2023 నుంచే పెచ్చులూడి పోవడం, లీకేజీలు కావడం మొదలయ్యాయి. భవనం దెబ్బతింటున్నా మరమ్మతులు చేయలేదనే ఆరోపణలు వచ్చాయి.

నిర్వహణ అంతంతే..

కలెక్టరేట్ భవన సముదాయ నిర్వహణ, పారిశుద్ధ్యం కూడా అధ్వానంగా తయారయ్యింది. ఇక్కడ విధులు నిర్వహించే ఉన్నతాధికారులు ఒక్కసారి కూడా మిగతా శాఖల కార్యాలయాలను సందర్శించకపోవడం విమర్శలకు తావిస్తోంది. పారిశుద్ధ్యం లోపించినా అడిగేవారు లేరని పలువురు ఆరోపిస్తున్నారు. తరచూ లిఫ్టులు పనిచేయడం లేదు. దీంతో ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యాలయంలో పలుచోట్ల మరుగుదొడ్లు, మూత్రశాలలు పాడయ్యాయి. వాటిని బాగు చేయడం లేదు. క్యాంటిన్ సైతం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఇక్కడ భోజనం సరిగ్గా లేకపోవడంతో చాలా మంది ఉద్యోగులు బయటకు వెళ్లి భోజనం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం కలెక్టరేట్‌లోని లోపాలను సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- కార్యకర్తలకు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపు

బంట్వారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం బంట్వారంలో బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. ఒక్కో బూత్‌కు 400 చొప్పున టార్గెట్ రీచ్ కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వెనుకబడిన బంట్వారం మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, ఇందుకోసం తన ఎంపీ నిధుల నుంచి రెట్టింపు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై విమర్శలు గుప్పించారు. ఇకపై ప్రతి గ్రామాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే ఇండియా ఆర్థికంగా మరింతగా బలోపేతం అవుతోందని అన్నారు. అనంతరం పార్టీ నాయకులు ఎంపీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, మండల అధ్యక్షుడు మహేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మల్లేష్, గీత సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశం గౌడ్, నాయకులు రమేష్, శ్రీకాంత్‌రెడ్డి, రాజు నాయక్, శరణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గిరిజన గురుకుల విద్యార్థులు

- జిల్లా స్థాయిలో సత్తాచాటిన ముగ్గురు
- పలు విభాగాల్లో బంగారు పతకాలు
- సన్మానించిన ప్రిన్సిపాల్ శ్రీనివాసులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

కొడంగల్ రూరల్: రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 12న నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ మీట్ - 2024లో పాత కొడంగల్ గిరిజన గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. పలు విభాగాల్లో విజేతలుగా నిలిచి బంగారు పతకాలు కైవశం చేసుకొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికయ్యారు. గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆంగోత్ ప్రవీణ్ షాట్‌పుట్ విభాగంలో 10.98 మీటర్లు విసిరి జిల్లా స్థాయి విజేతగా నిలిచాడు. అలాగే డిస్కస్‌త్రో విభాగంలో 16.60 మీటర్లు విసిరి రెండో స్థానం సొంతం చేసుకున్నాడు. 9వ తరగతి చదువుతున్న వికాస్ లాంగ్ జంప్ విభాగంలో 4.4 మీటర్లు, బ్యాక్ త్రో విభాగంలో 13 మీటర్లు, 60 మీటర్ల రన్నింగ్ రేస్‌లో 8.07 సెకండ్లలో చేరుకున్నారు. ఇలా అన్ని విభాగాల్లో జిల్లా స్థాయిలో సత్తా చాటాడు. నేనావత్ రమేష్(7వ తరగతి) ఖో-ఖో విభాగంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచాడు. ముగ్గురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు క్రీడాకారులు, పీడీ గోపాల్, పీఈటీ వెంకటేశ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకుల విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలపై కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా పీడీ, పీఈటీలను నియమించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి దేశ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

తాగునీరు కలుషితం

- రంగు మారిన మిషన్ భగీరథ జలం
- రోగాల బారిన జనం
- వాడుకునేందుకు కూడా పనికి రావంటున్న మండలవాసులు

దోమ: మిషన్ భగీరథ నీటి సరఫరాలో తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రతి ఇంటికీ తాగు నీరు సరఫరా చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి ఈ పథకాన్ని తీసుకొచ్చింది. అయితే నీటి సరఫరాలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దోమ మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మిషన్ భగీరథ నీరు రంగు మారి వస్తున్నాయి. మూడు రోజులుగా బురద, ఎర్రని నీరు వస్తోంది. ఆ నీటిని తాగలేకపోతున్నామని పలు గ్రామాల ప్రజలు తెలిపారు. కనీసం వాడుకోవడానికి కూడా పనికి రావడం లేదని అన్నారు. కలుషిత నీటిని తాగితే రోగాలు రావడం ఖాయమని అంటున్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.



రంగు మారిన మిషన్ భగీరథ నీరు

మినరల్ వాటర్‌కు పెరిగిన డిమాండ్

తాగునీరు కలుషితం కావడంతో ప్రజలు ఆ నీటిని వృథాగా వదిలేస్తున్నారు. ప్రస్తుతం మినరల్ వాటర్ కొనుగోలు చేసి తాగుతున్నారు. ఇదే అదనుగా భావించిన వాటర్ ప్లాంట్ నిర్వాహకులు 20 లీటర్ల బబుల్‌కు రూ.20 వరకు వసూలు చేస్తున్నారు. విధిలేని పరిస్థితిలో కొనుగోలు చేయాల్సి వస్తోందని పలువురు పేర్కొన్నారు.

కలుషిత నీటితో రోగాలు



మిషన్ భగీరథ నీరు కలుషితమైంది. తాగేందుకు వీలు లేదు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కలుషిత నీటిని తాగితే ఆరోగ్యం దెబ్బతింటుందని భయమేస్తోంది. వెంటనే చర్యలు తీసుకోవాలి.

– చాకలి భాస్కర్, బొంపల్లి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మిషన్ భగీరథ నీరు కలుషితం అయినట్లు పలు గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత త్వరలో సమస్య పరిష్కారమవుతుంది.

– మహేశ్‌బాబు, ఎంపీడీఓ, దోమ

6/6

- మదర్ డెయిరీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల హవా
- ఆరింటింకి ఆరు డైరెక్టర్ స్థానాల్లో విజయఢంకా
- ఫలించని బీఆర్‌ఎస్ ప్రయత్నాలు
- నేడు నూతన చైర్మన్ ఎన్నిక



గెలిచిన ఆరుగురు డైరెక్టర్లతో విజయ సంకేతం చూపుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మదర్ డెయిరీ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: నల్లగొండ- రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితి లిమిటెడ్ మదర్ డెయిరీ ఎన్నికల్లో ఓటర్లు కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులకే పట్టంకట్టారు. ఖాళీగా ఉన్న ఆరు డైరెక్టర్ల పదవులకు శుక్రవారం జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు. గెలుపు కోసం తుది వరకు పోరాడిన బీఆర్‌ఎస్‌కు భంగపాటు తప్పలేదు. ఆ పార్టీ బలపర్చిన నలుగురు అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. ఓటింగ్ శుక్రవారం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో జరిగింది. 297 మంది పాల సొసైటీ చైర్మన్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నాలుగు డైరెక్టర్లకు 8 మంది, రంగారెడ్డి జిల్లాలోని రెండు డైరెక్టర్ల స్థానాలకు నలుగురు పోటీపడ్డారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ నుంచి రంగంలోకి దిగిన నలుగురు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి(229 ఓట్లు), పుప్పాల నర్సింహులు (181 ఓట్లు), బత్తుల నరేందర్‌రెడ్డి (177 ఓట్లు), కల్లెపల్లి శ్రీశైలం (222 ఓట్లు) గెలుపొందగా, రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ నుంచే పోటీ చేసిన నలుగురిలో అగ్రాల నర్సింహారెడ్డి (242 ఓట్లు), మండలి జంగయ్య (237 ఓట్లు) గెలుపొందారు.

పెరిగిన కాంగ్రెస్ బలం

మదర్ డెయిరీలో మొత్తం 15 డైరెక్టర్ పదవులు ఉన్నాయి. అందులో ఆరు స్థానాలకు పదవీకాలం ముగియడంతో ఎన్నిక నిర్వహించారు. ఈ ఆరు పదవులను కాంగ్రెస్ మద్దతుదారులు గెలుచుకున్నారు. పదవిలో కొనసాగుతున్న 9 మంది డైరెక్టర్లలో కూడా ఆరుగురు ఇప్పటికే కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారు. దీంతో మదర్ డెయిరీలో కాంగ్రెస్ బలం 12కు చేరింది.

నేడు చైర్మన్ ఎన్నిక

మదర్ డెయిరీ చైర్మన్ ఎన్నిక కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. 15 మంది పాలకవర్గ సభ్యులతో శనివారం ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లకు పదవీ కాలాన్ని లాటరీ పద్ధతిలో నిర్ణయిస్తారు. ఇందులో ముగ్గురు డైరెక్టర్లకు నాలుగు సంవత్సరాలు, మిగతా ముగ్గురికి ఐదు సంవత్సరాలు పదవీకాలంగా నిర్ణయిస్తారు. అనంతరం శనివారంతో పదవీకాలం ముగియనున్న చైర్మన్ స్థానంలో నూతన చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. మెజార్టీ సభ్యులు బలపర్చిన అభ్యర్థి చైర్మన్‌గా ఎన్నిక అవుతారు. కాంగ్రెస్ మద్దతుదారులు ఎక్కువ ఉన్నందున ఆ పార్టీకి చెందిన డైరెక్టరే చైర్మన్ అవుతారు.

చైర్మన్‌గా గుడిపాటి మధుసూదన్‌రెడ్డి

మదర్ డెయిరీ నూతన చైర్మన్‌గా యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గుడిపాటి మధుసూదన్‌రెడ్డిని నిర్ణయించినట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వెల్లడించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా సీల్డ్ కవర్ చైర్మన్ ఎంపిక ఉండదన్నారు. పార్టీలో అందరి సమక్షంలో ముందుగా చైర్మన్ అభ్యర్థిగా గుడిపాటి పేరును ప్రతిపాదించినట్లు చెప్పారు. తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులను డైరెక్టర్లుగా గెలిపించిన పాల సొసైటీ చైర్మన్లకు రుణపడి ఉంటామని అయిలయ్య అన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

నర్సింహారెడ్డికి సన్మానం

దోమ: సొసైటీ ఎన్నికల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి డైరెక్టర్ పదవి కోసం పోటీచేసిన దోమ మండలం గూడూర్ గ్రామానికి చెందిన ఆగిరాల నర్సింహారెడ్డి విజయం సాధించారు. జిల్లా గ్రంథాలయ మాజీ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్, కాంగ్రెస్ నేతలు రాఘవేందర్ రెడ్డి, కావటి శ్రీనివాస్, యాదవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు.



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్

ఆమనగల్లు: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 77 ఏళ్లుగా తమ సంఘం పోరాడుతోందని అన్నారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాడ్గుల మండల పరిధిలోని కొల్కులపల్లి, నాగిళ్ల, మాడ్గుల, అవురుపల్లి, ఇర్విన్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన సమావేశాల్లో సదానందంగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పదోన్నతులు, బదిలీలు నిర్వహించినప్పటికీ ఉపాధ్యాయులకు జూలై నెల వేతనాలు నేటికీ మంజూరు చేయకపోవడం శోచనీయమని అన్నారు. వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయడంతో పాటు మెరుగైన ఫిట్‌మెంట్‌తో వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని కోరారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను అందించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. వెంటనే డీఎస్సీ వేసి నియామకాలు పూర్తి చేయాలని, అప్పటివరకు ఇబ్బంది లేకుండా విద్యా వలంటీర్లను నియమించాలన్నారు.

క్లుప్తంగా

వైద్యుడికి మెమో జారీ

అంబులెన్స్‌లో కవల పిల్లల జననం ఘటనపై సీరియస్



మాతా శిశు ఆరోగ్య కేంద్రం, తాండూరు

తాండూరు టౌన్: పట్టణంలోని ఎంసీహెచ్‌కు ప్రసవం కోసం వచ్చిన మహిళను హైదరాబాద్‌కు రెఫర్ చేయడంపై జిల్లా ఉన్నతాధికారులు శుక్రవారం స్పందించారు. 'అంబులెన్స్‌లో కవలల జననం' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు చర్యలు చేపట్టారు. కుల్కచర్ల మండలం ముజాయిదీపూర్‌కు చెందిన చంద్రకళ కాన్పు నిమిత్తం గురువారం తాండూరులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. పరీక్షించిన వైద్యుడు పరిస్థితి బాగోలేదంటూ నీలోఫర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అంబులెన్స్‌లో బయలుదేరిన కాసేపటికే ఆమె పండంటి కవల పిల్లలకు జన్మనిచ్చింది. అయితే సాధారణ కాన్పు ద్వారా కవలలకు జన్మనివ్వగా, ఎంసీహెచ్ వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేయడం పట్ల తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో స్పందించిన డీసీహెచ్‌ఎస్ ప్రదీప్‌కుమార్ 'సాక్షి'తో మాట్లాడారు. దీనిపై సదరు డాక్టర్‌కు మెమో జారీ చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిశంకర్‌కు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎంసీహెచ్‌లో అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన వాహనం, అదుపులో డ్రైవర్

బొంరాస్‌పేట: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన శుక్రవారం బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఉదయం కొత్తూరు–దేవనూర్ రోడ్డుపై నాగిరెడ్డిపల్లి శివారులో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో తాండూరుకు చెందిన మహేంద్ర లోడ్ కింగ్ వాహనంలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ బోయ రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎండీ రవూఫ్ తెలిపారు.

పేదలకు అండగా కాంగ్రెస్

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



ఆర్థికసాయం అందజేస్తున్న భీంరెడ్డి తదితరులు

కుల్కచర్ల: పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రాంనగర్ పంచాయతీకి చెందిన వెంకటయ్య ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భీంరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి ఆర్థికసాయం అంజదేశారు. ఈ కార్యక్రమంలో మైపాల్ రెడ్డి, సాయి,పాల్గొన్నారు.

అంటు వ్యాధులపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సురక్షా కౌన్సిలర్ పర్వతాలు

తాండూరు: అంటువ్యాధుల నియంత్రణపై నర్సింగ్ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని తాండూరు సంపూర్ణ సురక్షా కేంద్రం కౌన్సిలర్ పర్వతాలు అన్నారు. శుక్రవారం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో నర్సింగ్ కళాశాల విద్యార్థులకు అంటు వ్యాధుల సంక్రమణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంటు వ్యాధుల సంక్రమణ, నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌కే మేనేజర్ కృష్ణవేణి, డీసీఆర్‌సీ కౌన్సిలర్ కుమార్, సిబ్బంది, విద్యార్థులు తదితరులున్నారు.



పెద్దేముల్: పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు



ధారూరు: పీఎస్‌లో బీఆర్‌ఎస్ నాయకులు



బొంరాస్‌పేట: పీఎస్‌లో..

నియంత పాలనకు అరెస్టులే నిదర్శనం

పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వ పోకడలకు అక్రమ అరెస్టులే నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు నగరంలో నిరసన కార్యక్రమం చేపట్టడంతో పోలీసులు శుక్రవారం ఉదయం నుంచి బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేసి, మాజీ ఎమ్మెల్యేను హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేస్తే వారిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. నియంతలా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, రవికుమార్, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడడం హేయనీయం

పూడూరు: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపుడి గాంధీ.. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటికి దాడికి పాల్పడడం హేయనీయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రఫీస్‌ఖాన్, యూత్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ అన్నారు. బీఆర్‌ఎస్ చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి చన్గోముల్ ఠాణాకు తరలించారు.

ముందస్తు అరెస్టులు

పెద్దేముల్: ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, గాంధీల గొడపై కేసు నమోదు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్రవ్యాప్త ధర్నాకు పిలుపునిచ్చాడు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులను ముందస్తుగా అరెస్ట్ చేసి వ్యక్తిగత పూచికత్తుపై వదిలేసినట్లు పెద్దేముల్ ఎస్‌ఐ గిరి తెలిపారు.

ఆరుగురు నాయకుల అరెస్ట్

ధారూరు: మండల పరిధిలోని రాంపూర్‌తండా, కేరెళ్లి, ధారూరు గ్రామాలకు చెందిన ఆరుగురు బీఆర్‌ఎస్ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త ధర్నాకు వెళ్లకుండా శుక్రవారం ముందస్తు అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు.

అరెస్టులు సరికాదు

బొంరాస్‌పేట: మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపు మేరకు నిరసనకు వెళ్తున్న బీఆర్‌ఎస్ మండల నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, యాదగిరి, బీసీసెల్ అధ్యక్షుడు రవిగౌడ్, మైనార్టీ అధ్యక్షుడు ఎఫ్ఎస్ సలాం, మాజీ కోఆప్షన్ సభ్యుడు జలీల్, నాయకులు బండ శ్రీనివాస్, రాఘవేందర్‌రెడ్డి, రాముగౌడ్, ముస్తాఫా తదితరులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు.



పరిగి: పోలీసుల అదుపులో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

బీఆర్‌ఎస్ నేతలకు బైండోవర్

కుల్కచర్ల: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపు మేరకు ఇక్కడ నుంచి నగరానికి వెళ్లకుండా కొంత మంది నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండల పరిధిలోని పలువురు బీఆర్‌ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మాజీ వైస్ ఎంపీపీ రాజశేఖర్ గౌడ్, రఘు, సత్యయ్య, మహేశ్వరం రాములు, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

బంట్వారం ఠాణా పరిధిలో..

బంట్వారం: అక్రమ అరెస్టులకు నిరసనగా మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపు మేరకు హైదరాబాద్ వెళ్తున్న బంట్వారం బీఆర్‌ఎస్ నాయకులను ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి అరెస్ట్ చేశారు. వీరిలో బీఆర్‌ఎస్ నాయకులు ఖాజా, ప్రవీణ్ తదితరులున్నారు.

'కాంగ్రెస్ కనుసన్నల్లోనే దాడి'

తాండూరు టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం కనుసన్నల్లోనే ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడులకు పాల్పడ్డారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్ ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపు నేపథ్యంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు నగరానికి వెళ్లకుండా తాండూరు పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. రాజుగౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కక్షపూరిత పాలన కొనసాగుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేక ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు హైడ్రాతో పాటు ఇలాంటి దాడి ఘటనలను కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగులోకి తెస్తోందన్నారు. అరెస్టు చేసిన వారిలో శ్రీనివాసాచారి, సలీం, రాజన్‌గౌడ్, జావేద్, సందీప్ రెడ్డి తదితరులున్నారు.

అరెస్టులతో పోరాటాలను ఆపలేరు

ముందస్తు అరెస్టులతో పోరాటాలను ఆపలేరని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే గాంధీ అనుచరుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్వీ నాయకులు నర్సింహ, ఇమ్ము, లాలా, వినోద్ తదితరులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

అరెస్ట్ చేసి స్టేషన్‌కు..

అనంతగిరి: బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. నేతల ఇళ్ల వద్దకు చేరిన పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు మంచన్‌పల్లి సురేశ్, సుభాన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, భరత్, కిశోర్, మల్లికార్జున్, షఫీ, గోపి, లక్ష్మణ్, మల్లేశం, కాశయ్య తదితరులున్నారు.

నిరసన అడ్డుకోవడం అప్రజాస్వామికం

మర్పల్లి: బీఆర్‌ఎస్ నాయకుల నిరసన దీక్షకు వెళ్లకుండా పార్టీ నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కోట్ మర్పల్లి రాచన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో మర్పల్లి మాజీ ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ బి.మధుకర్, టౌన్ అధ్యక్షుడు గఫార్, మాజీ కోఆప్షన్ సభ్యులు సోయేల్ షరీఫ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రమేష్ మిత్ర, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గౌస్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, యాదయ్య, పీర్యానాయక్, దయాకర్, సునీల్, దీపక్, రవి తదితరులున్నారు.

పీఎస్ ఆవరణలో నిరసన

కొడంగల్ రూరల్: నగరానికి నిరసన వెళ్లకుండా గురువారం రాత్రి బీఆర్‌ఎస్ నాయకులను ముందుస్తు అరెస్టు చేయడం సరికాదని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్ అన్నారు. శుక్రవారం పీఎస్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులను వెంటేసుకుని సహచర శాసన సభ్యుడి ఇంటిపై దాడికి యత్నించడం సరికాదన్నారు. అరెస్ట్ అయిన వారిలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ముదిగండ్ల కృష్ణ తదితరులున్నారు.



బంట్వారం: పీఎస్‌కు తరలించిన పోలీసులు



తాండూరు టౌన్: ఠాణాలో బీఆర్‌ఎస్ నాయకులు



కుల్కచర్ల: ఠాణాలో..



మర్పల్లి: పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు



అనంతగిరి: వికారాబాద్ పీఎస్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులు

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు

తాండూరు టౌన్: ఇంటర్ చదువుతున్న తమ కూతురును ప్రేమ పేరుతో వేధిస్తున్నాడంటూ బాలిక తల్లి శుక్రవారం తాండూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. యాలాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన నట్టలి మనోహర్ అనే యువకుడు నిత్యం బాలికను ఇబ్బంది పెడుతున్నాడని, తనను ప్రేమించకపోతే పురుగుల మందు తాగి చనిపోతానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. కాలేజీ వద్దకు వచ్చి తన బైక్‌పై రావాలంటూ వేధిస్తున్నాడని, సదరు ఆకతాయి నుంచి మైనర్ అయిన తమ కూతురును కాపాడాలని ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

యువకుడిపై దాడి..

పాత కక్షలను మనసులో పెట్టుకుని ఓ యువకుడిని బలవంతంగా తీసుకెళ్లిన పలువురు అతనిపై దాడి చేసిన ఘటన తాండూరు పీఎస్ పరిధిలో శుక్రవారం వెలుగుచూసింది. సీఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. యాలాల మండలం ఎన్కేపల్లికి చెందిన నట్టల అనంతప్ప కుమారుడు మనోహర్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన బీటీ రాజేందర్, మహేందర్, బాలరాజు, భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్, రాము అనే ఆరుగురు తాండూరులోని సింధు బాలికల కళాశాల వద్ద నుంచి తన కుమారుడిని తీసుకెళ్లి ఓ టీస్టాల్ సమీపంలో రాడ్లు, కర్రలతో దాడి చేశారని అనంతప్ప ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'అమ్మ' కమిటీల పాత్ర కీలకం

ఎంపీడీఓ వినయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎంపీడీఓ

అనంతగిరి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అమ్మ ఆదర్శ పాఠశాలల పాత్ర కీలకమని వికారాబాద్ ఎంపీడీఓ వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ స్త్రీ శక్తి భవన్‌లో ఎంవీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు విద్యాహక్కు చట్టం, జెండర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ.. పాఠశాలల మరమ్మతు పనులను నాణ్యతతో పూర్తి చేశామన్నారు. కమిటీలు ఆడపిల్లల విద్యపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. విద్యార్థులు బడి మానేయకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఎఫ్ కోఆర్డినేటర్ భాస్కర్, సిబ్బంది శ్రీనివాస్, వెంకటయ్య, ఉమ, శశికళ, లక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

తాండూరు టౌన్: వ్యక్తి అదృశ్యమైన ఘటన తాండూరు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని అయ్యప్ప నగర్‌కు చెందిన వంగరి శ్రీకాంత్(30) ఈ నెల 10న తండ్రి కాళిదాసుకు ఫోన్ చేసి హైదరాబాద్ నుంచి ఇంటికి బయలుదేరానని చెప్పాడు. కానీ ఇంటికి రాలేదు. బంధు, మిత్రుల వద్ద వెతికినా ఆయన ఆచూకీ లభ్యమవ్వలేదు. దీంతో కాళిదాసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆస్తిపై కన్నేసి.. అన్నను హతమార్చి



వివరాలను వెల్లడిస్తున్న పట్టణ సీఐ విజయకుమార్

- ఫిర్యాదుదారుడినే హంతకుడిగా తేల్చిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: ఆస్తి కోసం అన్ననే హతమార్చాడు ఓ ప్రబుద్ధుడు. ఆపై మృతదేహాన్ని చెరువులోపడేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించాడు. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి హత్యగా తేల్చేశారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు శుక్రవారం పట్టణ సీఐ విజయ్‌కుమార్ వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామానికి చెందిన కృష్ణయ్యయాదవ్(50), కళమ్మ అలియాస్ కళావతి దంపతులకు పిల్లలు లేరు. దీంతో వారు ఒక బాబును దత్తత తీసుకుని కృష్ణయ్యయాదవ్ అత్తగారి ఊరైన మహేశ్వరం మండలం కల్వకోలు గ్రామంలో ఉంచారు. ఆయన భార్య కళావతి రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో కృష్ణయ్యయాదవ్ ఒంటరిగా జీవిస్తున్నాడు.

పది కోట్ల ఆస్తి కోసం ప్రాణం తీశాడు

వడ్డీ వ్యాపారం చేసే కృష్ణయ్యయాదవ్‌కు గ్రామ శివారులో పదికోట్ల విలువ చేసే ఐదు ఎకరాల పొలం ఉంది. అన్న ఆస్తిపై తమ్ముడు చంద్రయ్య యాదవ్ కన్నేశాడు. ఎలాగైనా అన్నను అంతమొందించి ఆస్తిని కాజేయాలని పథకం వేశాడు. ఈ నెల 7న చంద్రయ్య యాదవ్ మద్యం సేవిద్దామని అన్నను బైక్‌పై ఎక్కించుకుని గ్రామంలోని చెరువు వద్దకు తీసుకెళ్లాడు. ముందస్తు పథకం ప్రకారం.. అన్నకు మద్యం ఎక్కువ మద్యం తాగించాడు. మత్తులోకి వెళ్లినట్లు నిర్ధారించుకుని చెరువులోకి తోసి అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

10న పోలీసులకు ఫిర్యాదు

కృష్ణయ్యయాదవ్ కనిపించకపోవడంతో గ్రామస్తులు వెతకడం మొదలు పెట్టారు. తన అన్న కనిపించడం లేదని ఈ నెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాలుగు రోజుల తరువాత కృష్ణయ్యయాదవ్ మృతదేహం చెరువులో తేలియాడడంతో విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. భార్య చనిపోవడం, పిల్లలు లేక, మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడని చంద్రయ్యయాదవ్ పోలీసులను నమ్మించేందుకు యత్నించాడు. ఆయన మాటలపై అనుమానం రావడంతో పోలీసులు తమదైన శైలిలో విచారించారు. దీంతో ఆస్తి కోసం తానే హత్య చేసినట్లు ఒప్పుకొన్నాడు.

నగలు, నగదు, ఆస్తి పత్రాలు స్వాధీనం

కృష్ణయ్యాదవ్‌ను హత్య చేసిన రోజే చంద్రయ్య యాదవ్ తన అన్న ఇంటికివెళ్లి ఇంట్లోని నగదు, బంగారం, ఆస్తి పత్రాలను ఎత్తుకెళ్లాడు. కృష్ణయ్య యాదవ్ అంత్యక్రియలకు వచ్చిన మృతుడి అత్త ఇంట్లో నగలు, నగదు, ఆస్తి పత్రాలు లేవని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో చంద్రయ్యయాదవ్‌ను విచారించిన పోలీసులు బంగారం, డబ్బు, ఆస్తి పత్రాలు దొంగిలించినట్లు గుర్తించారు. నిందితుడి నుంచి మూడు తులాల బంగారం, రూ.31,500నగదు, ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ సుశీల, సిబ్బంది మహేశ్, రామకృష్ణ, రఫీ, జ్యోత్స్నను పట్టణ సీఐ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ బలరాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాగుకు వంతెన లేక.. వెళ్లేందుకు దారి లేక

- జాతరకు దూరమవుతున్న కుదురుమల్ల గ్రామస్తులు
- వంతెన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్

దుద్యాల్: దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇముడాపూర్‌లో అల్ల రాయప్ప స్వామి వారి ఉత్సవాలు ఏడాది ఒక సారి నిర్వహిస్తుంటారు. ఈ జాతరకు కుదురుమల్ల, ఇముడాపూర్ గ్రామస్తులు ఎక్కువగా వెళ్తుంటారు. ఈ ఆలయానికి చేరకునేందుకు మధ్యలో వాగు ఉంటుంది. ప్రతీ ఏడాది సరైన సమయంలో వర్షాలు కురిసి జాతర సమయానికి వాగు మీదుగా బాట సాగేది. కానీ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురియడంతో వాగు నిండుగా పారుతోంది. ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలని ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నించినా పట్టించుకోలేదని ఇప్పుడు జాతర ఎలా వెళ్లాలని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

అధికారులపై ఒత్తిడి తెస్తాం



వంతెన నిర్మాణానికి పలుమార్లు ప్రజా ప్రతినిధులకు విన్నవించాం. ఎవరూ పట్టించుకోలే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వాగుపై వంతెన నిర్మాణం మరియు బీటీ రోడ్డు నిర్మాణం కొరకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పనులు త్వరితగతిన ప్రారంభించేలా అధికారులపై ఒత్తిడి తీసుకువస్తాం.

– రఘుపతి, మాజీ సర్పంచ్, కుదురుమల్ల



కుదురుమల్ల-ఇముడాపూర్ మధ్య పారుతున్న వాగు

తూము బాగు చేయండి

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్ గ్రామ చెరువు తూము నుంచి నీరు వృథాగా పారుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వృథాగా పారుతున్న నీరు

పదిరోజుల క్రితం కురిసిన వర్షాలకు చెరువు అలుగు పారింది. దీంతో పాటు తూము నుంచి సైతం నీరు కిందకు వృథాగా పోతున్నాయి. దీంతో గ్రామస్తులు సంబంధిత అధికారులకు వారం క్రితమే సమాచారం అందించారు. సిబ్బందిని పంపిస్తామన్న అధికారులు ఇప్పటి వరకు స్పందిచడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

తాండూరు రెవెన్యూ డివిజన్‌లో సర్వే



తాండూరు రూరల్: వివరాలు నమోదు చేస్తున్న సర్వే బృందం

తాండూరు రూరల్: తాండూరు రెవెన్యూ డివిజన్‌లోని ఆయా గ్రామాలకు సంబంధించి పేర్లు వాడుక భాషలోనే ఉన్నాయా, ఇతర భాషలోకి ఏమైనా మారాయా..? అనే దానిపై కేంద్ర సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒక బృందం సర్వే నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది బృంద సభ్యులు తాండూరు రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి వివరాలు సేకరిస్తున్నారు. గ్రామాలకు సంబంధించిన పేర్లు, అనుబంధ గ్రామాల భౌగోళిక మార్పులు, సహజ సిద్ధంగా ఉన్నాయా..? లేక మార్పులు జరిగాయా..? అనే విషయాలపై సమగ్రంగా సర్వేయర్లతో చర్చిస్తున్నారు. ఈ సమగ్ర సర్వే వివరాలకు సర్వే డిపార్ట్‌మెంట్ మ్యాప్‌లో పొందుపరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్, శివకుమార్, మహేష్ ఉన్నారు.